www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 7 అక్టోబర్ 2025

5

తిరుపతి

మామిడి రైతులకు అమలు కాని సిఎం వాగ్దానాలు

ప్రజాశక్తి - చంద్రగిరి

మళ్లీ కొత్త సీజన్ మొదలవుతున్నప్పటికీ, గత సీజన్‌లో సిఎం చంద్రబాబు మామిడి రైతులకు ఇచ్చిన వాగ్దానాలు అమలు కాలేదని రైతుసంఘాల నేతలు వాపోయారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, మార్కెట్ లోపాలు, ప్రాసెసింగ్ యూనిట్ల సమస్యలతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతుసంఘాల నాయకులు యారాసి చంద్రశేఖర్‌రెడ్డి ఆరోపించారు. చంద్రగిరిలో సోమవారం మామిడి రైతుల సమస్యలపై చర్చావేదిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తామని చెప్పిన కిలోకు 4 రూపాయలు ఇంకా చెల్లించలేదన్నారు. పల్స్‌ఫ్యాక్టరీలు సైతం ఇష్టారాజ్యంగా ధర నిర్ణయించి ఎంతోకొంత అంటూ ఇస్తున్నారు తప్ప, ప్రభుత్వం నిర్ణయించినట్లుగా రూ.8 ఇవ్వలేదన్నారు. అనంతరం సమస్యలు పరిష్కరించాలంటూ డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. రైతుల సమస్యలు పరిష్కరించని పక్షంలో పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

చిత్తూరు పోలీసు అతిథిగృహంలో మీడియాతో ఎస్పీ తుషార్‌డూడి

'అంబేద్కర్' ఘటన ఉద్దేశపూర్వకం కాదు

పోలీసుల అదుపులో సర్పంచ్ గోవిందయ్య

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

వెదురుకుప్పం మండలం దేవళంపేటలో అంబ్కేదర్ విగ్రహానికి నిప్పు ఉద్దేశపూర్వకంగా జరిగింది కాదని, అనుకోని విధంగా జరిగిందని జిల్లా ఎస్పీ తుషార్‌డూడి తెలిపారు. సోమవారం చిత్తూరు పోలీస్ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. సర్పంచి గోవిందయ్య కుట్రకోణం ఉందన్న అనుమానంతో అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన సంఘటనలో అతనిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం రాత్రి అంబేద్కర్ విగ్రహం దగ్ధమైన ఘటన నేపథ్యంలో శనివారం దేవళంపేట సర్పంచి గోవిందయ్య, దళితులు,బీసీలతో కలిసి రాస్తారోకో చేశారు. స్థానిక పోలీసులు స్పందించలేదని నిరసన వ్యక్తం చేశారు. అదేరోజు సమాచారం అందుకున్న చిత్తూరు ఎస్పీ తుషార్ డూడి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ ఘటనకు గ్రామంలోని టిడిపి నాయకుడు సతీష్‌నాయుడు కారణమని సర్పంచి గోవిందయ్య ఆ సందర్భంగా గట్టిగా వాదించారు.

దేవళంపేటలో అంబేద్కర్ విగ్రహం దహనంపై బొమ్మనపల్లి పంచాయతీ కార్యదర్శి జి.రాము నుంచి ఫిర్యాదు తీసుకుని ఎస్ఐ వెంకటసుబ్బయ్య కేసు నమోదు చేసి విచారణ చేపట్టామని ఎస్పీ సోమవారం మీడియాకు తెలిపారు. ఘటనపై విచారణ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. దీంతోపాటు క్లూస్‌టీం, సిసి కెమెరాల ఫుటేజీలతో పాటు ఘటనా స్థలంలోని నివాసితులు, ఇతర సాంకేతిక అంశాల ఆధారంగా దర్యాప్తు చేశామన్నారు. ప్రమాదవశాత్తు జరిగిన ఘటనను ఆసరాగా చేసుకున్న సర్పంచి గోవిందయ్య ప్రత్యర్థులపై కక్ష తీర్చుకునే ప్రయత్నం చేశారనే అనుమానం ఉందన్నారు. ఈ కేసులో 12 మందిని విచారించినట్లు చెప్పారు. నగరి డిఎస్‌పి సయ్యద్ మహ్మద్ అజీజ్ నేతృత్వంలో కార్వేటినగరం ఇన్‌స్పెక్టర్ హనుమంతప్ప, వెదురుకుప్పం ఎస్‌ఐతో కలిసి మూడు బృందాలుగా విచారణ చేపట్టినట్లు చెప్పారు.

దేవళంపేటలో సంతగేటు వద్ద అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ విగ్రహానికి సమీపంలోనే సులోచన చినబంకు ఏర్పాటు చేసుకున్నారు. అందులో గుర్తు తెలియని వ్యక్తి ఈ నెల 2న అర్ధరాత్రి నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగాయి. ఈ పొగ వల్ల విగ్రహం దెబ్బతింది. అక్కడికి ఫోరెన్సిక్, డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీంలు వెళ్లాయి. అన్ని రకాల ఆధారాలను సేకరించారు. దేవళంపేటలో వేకువజామున జరిగిన ఈ ఘటనకు సంబంధించి సాంకేతికంగా సెల్‌డేటా కూడా సేకరించినట్లు చెప్పారు. శనివారం వేకువజామున రెండు మూడు గంటల ప్రాంతంలో అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటన జరిగిన ప్రదేశానికి సమీపంలో దిల్షాద్ నివాసం ఉంటున్నారు. ఆమె ఇంట్లో పనిమనిషి మీనాక్షి మొదట చూసినట్లు విచారణలో తేలిందని ఎస్పీ చెప్పారు. వెంటనే దిల్షాద్‌కు చెప్పారు. దిల్షాద్ ద్వారా విషయం తెలిసిన సులోచన సర్పంచికి తెలిపారు. ఈ కోణమే అంబేద్కర్ విగ్రహం దగ్ధం కేసులో చిక్కుముడి వీడిందని ఎస్పీ వివరించారు. ఘటన జరిగిన వెంటనే పోలీసులకు చెప్పకపోవడం వెనుక దాగి ఉన్న కుట్రను దర్యాప్తు బృందాలు తేల్చాయని తెలిపారు. అంబేద్కర్ విగ్రహానికి సమీపంలోదగ్ధమైన షాపు యజమాని సులోచనను సర్పంచి గోవిందయ్య మేనేజ్ చేశారని బయట పడిందన్నారు.షాపు కాలిపోయిన బాధితురాలు సులోచనతో సర్పంచుకు ఆర్థిక లావాదేవీలు ఉన్నాయి. ఈ సంఘటన ద్వారా ప్రత్యర్థి సతీష్‌నాయుడుపై నెపం నెట్టి, సంచనలం సృష్టించాలని ప్రయత్నించారని, తన పదవీకాలంలోనే మంచి ప్రదేశంలో దుకాణం ఏర్పాటుకు స్థలం కేటాయిస్తానని సులోచనను సర్పంచి గోవిందయ్య మభ్యపెట్టారు. అంబేద్కర్ విగ్రహ దగ్ధం ఘటన రాష్ట్ర , జాతీయ స్థాయిలో సంచలనం చేసేందుకు సర్పంచ్ వ్యవహరించడం చట్టరిత్యా నేరమని తెలిపారు. ఈ సందర్భంగా మొత్తం 12 మంది వ్యక్తులను తాము విచారించామన్నారు.

సిఎం పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్, ఎస్పీ

నేడు నారావారిపల్లికి చంద్రబాబు

ప్రజాశక్తి - చంద్రగిరి

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సోదరుడు మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడి విస్తరణ (11వ నెల బట్టలు పెట్టే కార్యక్రమం) కార్యక్రమానికి ఏర్పాట్లును అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఈ సందర్భంగా సీఎం వ్యవసాయ పొలంలో నారా రామ్మూర్తి నాయుడు ఘాట్ నిర్మించారు. ఈ కార్యక్రమానికి సిఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ వస్తుండడంతో నారావారిపల్లెకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కానున్న నేపథ్యంలో నారా అభిమానుల రాకకోసం సుమారు 10 వేలకు పైగా టీడీపీ నాయకులు, కార్యకర్తలకు భోజన ఏర్పాట్లు చేస్తున్నారు. సీఎం ఇంటి సమీపంలో సంతాప సభ ఏర్పాటు చేసి, నివాళులు అర్పించడానికి ప్రత్యేక షెడ్డు ఏర్పాటు చేసారు. ఇప్పటికే నారావారిపల్లెకు మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు సతీమణి నారా ఇందిర, ఆయన పెద్ద కుమారుడు నారా గిరీష్ చేరుకోగా, సోమవారం మధ్యాహ్నం చిన్న కుమారుడు సినీ హీరో నారా రోహిత్, సాయంత్రం 6 గంటలకు సీఎం సతీమణి నారా భువనేశ్వరి నారావారిపల్లెకు చేరుకున్నారు. విస్తర కార్యక్రమం సందర్భంగా ముఖ్యమంత్రి నారావారిపల్లి పర్యటన నిమిత్తం రానున్న నేపథ్యంలో తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, అధికారులు, ఎ.రంగంపేట హైస్కూల్ వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్ నుండి నారావారిపల్లెలో సీఎం ఇంటి వరకు కాన్వాయ్ రిహార్సల్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీలు పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను సమీక్షించారు. ముఖ్యమంత్రి సజావుగా, భద్రతా పరంగా ఎటువంటి అంతరాయం లేకుండా జరిగేలా సంబంధిత శాఖల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు. అదేవిధంగా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్రెడ్డి, యాదవ కార్పోరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, తిరుపతి గంగమ్మగుడి చైర్మన్ మహేష్, పారిశ్రామిక వేత్త ఏవీ రమణమూర్తి కూడా నారావారిపల్లెలో జరిగే ఏర్పాట్లును పర్యవేక్షిస్తున్నారు. సీఎం నారావారిపల్లె పర్యటన ఏర్పాట్లలో పోలీస్, ఫైర్, హెల్త్, విద్యుత్, మున్సిపల్, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ కార్యక్రమానికి మంగళవారం ఉదయం 11.10 గంటలకు చేరుకుని, అదేరోజు మధ్యాహ్నం తిరిగి వెళ్లనున్నారు.

సమస్యకు సత్వరం పరిష్కారం చూపాలి : కలెక్టర్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి అర్జీకి నాణ్యమైన పరిష్కారం నిర్దేశించిన గడువులోపు చూపాలని జిల్లా అధికారులను కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదేశించారు. సోమవారం తిరుపతి జిల్లా కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేందర్ రెడ్డి, సుధారాణి, రోజ్ మాండ్ లతో కలిసి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ అర్జీలను స్వీకరించారు. రెవిన్యూ-157, పౌరసరఫరాల శాఖ -10, సెర్ప్ -10, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ -06, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ -17, పోలీసు శాఖ -15 మొత్తం కలిపి 276 అర్జీలు వచ్చినట్లు అధికారులు ప్రకటించారు.

కుట్రపూరితంగా దుకాణాన్ని తొలగించారు : పండిటి శ్రీనివాసులు, ఎన్టీఆర్ కాలనీ, వెంకటగిరి

తిరుపతి జిల్లా వెంకటగిరి క్రాస్ రోడ్డు మార్గంలోని సర్వేనెంబర్ 109/6లో కాలువ పోరంబోకు భూమిలో కుటుంబ జీవనాధారం కోసం చిన్నపాటి టీ కొట్టును ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నాను గత 25 ఏళ్లుగా నాతోపాటుగా ఈ ప్రాంతానికి సంబంధించిన కొంతమంది పెత్తందారులు కూడా వారి వారి ప్రాబల్యాలకు అనుకూలంగా పెద్ద సంఖ్యలో స్థలాన్ని ఆక్రమించుకొని ఇళ్ల నిర్మాణం కూడా చేసి ఉన్నారు. అయితే ఈ నెల నాలుగో తేదీన ప్రభుత్వ అధికారులు నాకు సంబంధించిన టీ దుకాణాన్ని కుట్రపూరితంగా తొలగించారు. నేను మాదిగ సామాజిక వర్గానికి సంబంధించిన వాడినని నా టీ కొట్టును తొలగించారు. జిల్లా కలెక్టర్ స్పందించి జీవనాధారమైన టీ కొట్టును మళ్ళీ ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

మా పొలాలకు దారి చూపండి : ఉస్తికాయలపెంట గ్రామస్తులు, యర్రావారిపాలెం మండలం

తిరుపతి జిల్లా ఎర్రావారిపాలెం మండలం ఉస్థికాయల పెంట గ్రామం తూర్పుపల్లికి సంబంధించి మా పొలాలకు దారి చూపాలి. ప్రభుత్వానికి సర్వే నిమిత్తం చలానా కట్టాం. మాకు పూర్వం నుండి పొలాలకు వెళ్లేందుకు అడవి పక్కన ఉన్న దొంకల మార్గాన్ని వినియోగించే వాళ్ళం. రాజారెడ్డి మాకు అందుబాటులో ఉన్న మార్గాన్ని రాళ్లు పోసి మూసేశాడు. ఐదు అడుగుల స్థలాన్ని విడిచిపెట్టమని కోరినా పట్టించుకోలేదు. పొలాలకు పోవడానికి చాలా ఇబ్బందిగా ఉంది. సర్వే కోసం వచ్చిన సర్వే శ్రీకాంత్ భూభాగాన్ని కొలిచి ప్రభుత్వ భూమి ఉంది అని చెప్పి వెళ్ళిపోయారు. అటు తర్వాత స్థానిక విఆర్‌ఓ సుబ్రహ్మణ్యం మమ్మల్ని ఇబ్బంది పెట్టిన వారి వద్ద డబ్బులు తీసుకుని ఏదో ఒక కారణం చెబుతూ మాకు మార్గం చూపకుండా కాలయాపన చేస్తున్నారు. వెంటనే సర్వే రాళ్లను నాటి మాకు దారి సౌకర్యం ఏర్పాటు చేయండి.

అదేంటో.. మూడేళ్లుగా పరిష్కారం కాలేదు : ఎన్.లక్ష్మయ్య, అరణ్యకండ్రిగ, నారాయణవనం

భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూ ప్రమాదవశాత్తు భవనంపై నుండి పడిపోయాను. నడుము భాగంలో కోలుకోలేని విధంగా నరము తెగిపోయిందని వైద్యులు చెప్పారు. ఈ ప్రమాద ఘటన జరిగి మూడు సంవత్సరాలు అయ్యింది. జీవితాంతం మంచానికే పరిమితమైన నాకు వికలాంగ పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ గత మూడేళ్లుగా ప్రభుత్వ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నాను. అయినా అధికారుల నుంచి స్పందన లేదు. మంచంలో లేవలేని నేను చివరకు స్ట్రెచర్‌లో కలెక్టరేట్‌కు నా కుటుంబ సభ్యులు తీసుకొచ్చారు అని బాధితుడు ఎన్.లక్ష్మయ్య జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌తో మొరపెట్టుకున్నారు. శుభం బన్సల్ నేరుగా వచ్చి బాధితుడు వద్దనే అర్జీ తీసుకొని, సంబంధిత డిఆర్డిఏ పిడి శోభన్ బాబును పిలిపించి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గడిచిన మూడేళ్లుగా వికలాంగ పింఛన్ కోసం తిరుగుతున్నా ఏ అధికారీ పట్టించుకోలేదని జాయింట్ కలెక్టర్ వద్ద కుటుంబ సభ్యులు వాపోయారు. ప్రతి వారం నాణ్యమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ చెబుతూనే ఉంటారు. అదేంటో మూడేళ్లుగా పరిష్కారం చూపలేదు మరి.

మూడేళ్లుగా మంచంలోనే.. అయినా పింఛన్ రాలేదంటే స్రెచర్‌పై కలెక్టరేట్‌కు...

చెప్పిందొకటి...ఇస్తుందొకటి : టిటిడి కార్మికులు

టీటీడీకి చెందిన శ్రీ లక్ష్మీ శ్రీనివాస మ్యాన్ పవర్ కార్పొరేషన్ ద్వారా పరిచారక, పోటు వర్కర్, ప్రసాదాల పంపిణీ ఉద్యోగాలకు కుదిరాము. జూన్ 2024న ఉద్యోగాలలో చేరిన మాకు నెలకు రూ.30 వేల రూపాయల ఇస్తామని చెప్పారు. రెండు నెలలు రూ.30 వేల రూపాయలు చెల్లించి తరువాత రూ. 18 వేల రూపాయలు మాత్రమే చెల్లిస్తున్నారు. ఇదేమిటని ఉన్నతాధికారులను అడగ్గా సాంకేతిక సమస్యలు ఉన్నాయని, త్వరలోనే మీకు సంబంధించిన ఫైల్ అధికారుల ద్వారా తగిన చర్యలు తీసుకొని తదుపరి రూ.30 వేల రూపాయలు చెల్లిస్తామంటున్నారు. సుదూర ప్రాంతాల నుండి శ్రీవారి కైంకర్యాలలో పాలుపంచుకునే తమకు ఇక్కడ ఉద్యోగమే జీవనాధారం. చాలీచాలని జీతంతో కుటుంబాలను, కుటుంబా ఆర్థిక అవసరాలను తీర్చలేక పోతున్నాము. దయవుంచి మా సమస్యను అర్థం చేసుకొని జిల్లా కలెక్టర్ పరిష్కరించాలి.

ఇన్సూరెన్స్ డబ్బుల కోసం భర్త పేరే మార్చేశారు : రవిశేఖర్‌రెడ్డి, కొర్లగుంట

అనారోగ్య కారణాలతో చనిపోయిన నా భార్య ఇ.మాధవికి సంబంధించిన ఇన్సూరెన్స్ డబ్బుల కోసం నా భార్య తండ్రి ఇ.కేశవుల రెడ్డిని భర్తగా చూపుతూ తగిన నకిలీ ఆధారాలను తయారు చేసి డబ్బులను దోచుకున్నారు. నడవలూరు పంచాయతీకి సంబంధించి ఈ తతంగం అంతా గత వైసిపి హయాంలో జరిగింది. ఆర్సిపురం జడ్పిటిసి ఢిల్లీరాణి భర్త భాను కుమార్ రెడ్డి, మరికొందరు కలిసి నా భార్య మరణానంతరం ఆమె శరీరం నుండి తొలగించిన 90 గ్రాముల బంగారం దౌర్జన్యంగా సంఘాలలో బాకీ ఉన్నారని తీసుకెళ్లి తమ వద్ద ఉంచుకున్నారు. నేను విచారణ చేయగా సంఘంలో ఎటువంటి అప్పులు లేవని తేలింది. ఇదేమిటండి ప్రశ్నిస్తే దాడి చేయడమే కాక, పొలాన్ని వారి పేరుపై రాసి ఇవ్వాలని బలవంతంగా తెల్లటి కాగితాలపై సంతకాలు చేయించుకున్నారు. ఊరిలోకి వస్తే చంపుతామని బెదిరిస్తున్నారు. ఇంతటి అన్యాయానికి కారణమైన వారిని విచారించి, చట్ట పరంగా తగిన చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరుతున్నాను.

దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

సనాతన ధర్మానికి అవమానం జరిగిందన్న పేరుతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి. ఆర్. గవాయ్ పై మతోన్మాద అడ్వకేట్ ఒకరు కోర్టులో అందరూ చూస్తుండగానే చెప్పు విసరటం దేశంలో నెలకొన్న దుస్థితికి అద్దం పడుతోందని, ఈ ఘటనలో దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మోడీ పాలనలో మతోన్మాదులు అన్ని వ్యవస్థలను ఇప్పటివరకు ధ్వంసం చేస్తూ వచ్చారని, ఇప్పుడు బహిరంగంగా సనాతనధర్మ పరిరక్షణ పేరుతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పైనే చెప్పు విసరటం రాజ్యాంగానికి, దేశ ప్రజలకు అవమానం అన్నారు. సనాతన ధర్మం పేరుతో ప్రచారం చేస్తున్న పవన్ కళ్యాణ్ ఈ చర్యను బలపరుస్తారా? వ్యతిరేకిస్తారా? సమాధానం చెప్పాలన్నారు. దళితుల నుండి ఉన్నత స్థాయికి ఎదిగిన గవాయ్ లాంటి వారిని చూసి సహించలేక చేసిన అగ్రకుల మతోన్మాద చర్యని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావతం కాకుండా సనాతన ధర్మ వాదుల్ని అరికట్టాలని డిమాండ్ చేశారు.

ఇరకందీవిలో బాలుడు గల్లంతు

ప్రజాశక్తి - తడ

తడ మండలం లోని ఇరకం గ్రామంలో రామరాజు (17) బాలుడు పులికాట్ సరస్సు లో పడి గల్లంతు అయ్యాడు. అందిన సమాచారం మేరకు తమిళనాడు కు చెందిన తిరువళ్ళూరు జిల్లా ఎన్నూరు గ్రామంలో నివాసం ఉంటున్న ఎల్లయ్య కుటుంబ సభ్యులు ప్రతి ఏటా జరిగే వేంకటేశ్వర స్వామి పేరుమాళ్ కు శనివారం తిరణాలకు ఇరకం దీవి గ్రామం లో వుంటున్న తమ బంధువుల ఇంటికి వెళ్ళారు. సోమవారం సరదాగా తాత ఆర్ముగం పడవ ప్రయాణం చేస్తుండగా సున్నం గుంట ప్రాంతంలో రామరాజు పడవలో నుండి జారి నీటిలో పడిపోయి గల్లంతయ్యాడు. గల్లంతయిన రామరాజు ను మత్స్యకారులు గాలింపు చేపట్టారు.ఇంతవరకు ఆచూకీ లభించలేదు.

విగ్రహావిష్కరణ విజయవంతానికి కృతజ్ఞతలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

శ్రీ భక్త కనకదాసు విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సహకరించిన ప్రజాప్రతినిధులకు, కుల బంధువులకు, అధికారులకు అందరికీ కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ కురుబ, కురుమ, కురువ సంఘం అధ్యక్షులు జబ్బల శ్రీనివాసులు తెలిపారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో జరగబోయే సంఘం పదో వార్షికోత్సవ సభకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 12న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కురుబ, కురుమ, కురువ సంఘం పదవ వార్షికోత్సవాన్ని విజయవాడ కేంద్రంగా నిర్వహించి రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటామన్నారు. అలానే సౌత్ ఇండియా ఓబీసీ సెమినార్ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమాలకు దక్షిణ, ఉత్తర భారతదేశంలోని 12 రాష్ట్రాలకు సంబంధించిన బీసీ ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరవుతున్నారన్నారు. ఈ విలేకరుల సమావేశంలో న్యాయవాది రవిశంకర్, తరిగొండ ఈశ్వరయ్య పాల్గొన్నారు.

టీటీడీని బి.ఆర్ నాయుడు అపవిత్రం చేస్తున్నాడు: కరుణాకర్‌రెడ్డి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

హిందువులకు అత్యంత పవిత్రమైన టీటీడీని ప్రస్తుత చైర్మన్ బిఆర్ నాయుడు తన వ్యక్తిగత ప్రాబ్లం కోసం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అపవిత్రం చేస్తున్నాడని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి విమర్శించారు. స్థానిక పద్మావతి పురంలోని కరుణాకర్ రెడ్డి నివాసంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీటీడీలో జరుగుతున్న తప్పిదాలను ఎత్తిచూపితే సరిదిద్దుకోవాల్సింది పోయి ప్రస్తుత చైర్మన్ బిఆర్ నాయుడు తనపై వ్యక్తిగత విమర్శలే పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. 13 రోజుల క్రితం టీటీడీ అడిషనల్ ఈవో తండ్రి చనిపోతే, రెండు మూడు రోజుల క్రితం ఆయన తండ్రికి పెద్దకర్మ జరిగిందన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ అత్యుత్సాహంతో తిరుమల వెంకటేశ్వర స్వామి ఆభరణాలను భద్రపరిచే బొక్కసం సంరక్షకుడు గురురాజు స్వామి ఆధ్వరంలో, వేదమంత్రాలు పఠించే అర్చకులు ద్వారా ఏటి సూతకం ఉన్న అడిషనల్ ఈవోకు ఏకంగా పరివట్టం కట్టించి, శ్రీవారి పట్టు వస్త్రాలను కప్పి, వేద ఆశీర్వాదం ఇప్పించారని గుర్తు చేశారు. అది కూడా చనిపోయిన వ్యక్తి చిత్రపటం ఎదుట చేయడం శోచనీయమన్నారు. ఇలాంటి విచిత్ర ధోరణి సరైనది కాదని హితవు పలికారు. ఈ సమావేశంలో తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష, వైఎస్ఆర్ సీపీ నగర అధ్యక్షులు మల్లం రవిచంద్ర రెడ్డి పాల్గొన్నారు.

కావాలనే కరుణాకర్ రెడ్డి రాద్ధాంతం : భానుప్రకాష్‌రెడ్డి

వైయస్సార్ సిపి నాయకులు భూమన కరుణాకర్ రెడ్డి కావాలనే టిటిడిపై రాద్ధాంతం చేస్తున్నారని దేవస్థానం పాలక మండలి సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి విమర్శించారు. తిరుపతిలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీటీడీ చైర్మన్ బిఆర్ నాయుడు టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి తండ్రి పెదకర్మలో పాల్గొన్న సందర్భంగా కరుణాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు సరైనది కాదన్నారు. స్వామివారి పట్టు వస్త్రం కప్పి పరివట్టం చేతికి కట్టడంపై గతంలో ధర్మారెడ్డికి పరి వట్టం కట్టి వస్త్రం కప్పినప్పుడు మీరు కళ్ళు మూసుకొని ఉన్నారా అని ప్రశ్నించారు.

రెడ్డయ్య రాజుకు విశేష సేవా పురస్కారం

ప్రజాశక్తి- తిరుపతి సిటి

వశిష్ట, చైతన్య పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కొండూరు రెడ్డయ్య రాజును రాజమండ్రి ఎడ్యుకేషన్ స్పెషల్ విద్యారంగ పత్రిక, గోదావరి టాలెంట్ టెస్ట్ ఆధ్వర్యంలో విశేష సేవా పురస్కారంతో సత్కరించారు. రాజమండ్రి రౌండప్ వారు నిర్వహించిన ఆదర్శ గురువుల సత్కార సమారోహ అనే కార్యక్రమంలో రాష్ట్రస్థాయిలో విశిష్ట సేవా పురస్కారంతో సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా విశిష్ట సేవా పురస్కార అవార్డు 2025 ను అందజేశారు. ఈ సందర్భంగా పురస్కార గ్రహీత డాక్టర్ కొండూరు రెడ్డయ్య రాజు మాట్లాడుతూ విద్య ఆవశ్యకతను గురించి ప్రసంగించారు. రాజమహేంద్రవరంలో గోదావరి తల్లి ఆశీర్వాదం వలన ఈ అవార్డు అందుకోవడం చాలా సంతోషంగా ఉందని, ఈ అవార్డును పాఠశాల స్థాపకులు తన తండ్రి కొండూరు పెద్దరామరాజు, తల్లి సుబ్బమ్మ, ఉపాధ్యాయ ఉపాధ్యాయనిలకు, విద్యార్థులకు అంకితమని తెలియజేశారు. అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థులు పలువురు ప్రముఖులు ఆయనను అభినందించారు.



తిరుపతి జిల్లాకు 51 స్వచ్ఛాంధ్ర అవార్డులు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

స్వచ్ఛ అవార్డులు అందుకున్న వారితో కలెక్టర్, జేసీ

స్వచ్ఛాంధ్ర...స్వర్ణాంధ్ర నినాదంతో ప్రతి నెలా మూడో శనివారం నిర్వహించే వినూత్న థీమ్‌తో స్వచ్ఛతా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, తిరుపతి జిల్లాకు 51 అవార్డులు వచ్చాయని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ లోని సమావేశ మందిరం నందు జిల్లా స్థాయి స్వచ్ఛ ఆంధ్ర అవార్డుల కార్యక్రమంలో గ్రీన్ అండ్ బ్యుటిఫికేషన్ చైర్ పర్సన్ సుగుణమ్మ, కార్యక్రమంలో గ్రీన్ అండ్ బ్యుటిఫికేషన్ డైరెక్టర్ రమేష్ బాబు, యాదవ కార్పోరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, బెస్త కార్పోరేషన్ చైర్మన్ బొమ్మన శ్రీధర్ , డిప్యూటీ కమీషనర్ అమరయ్య, డి.పి.ఓ. సుశీలా దేవి లతో కలసి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ....రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పరిశుభ్రత,స్వచ్ఛత పై, ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రజలకు అవగాహన , చైతన్యం కలిగించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అన్నారు. మన జిల్లా నుండి గత తొమ్మిది నెలల్లో వినూత్నమైనటువంటి కార్యక్రమాలు ప్రతి నెల వినూత్నమైన థీం తో ఈ కార్యక్రమం చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లాకు మొత్తం 18 కేటగిరి లలో 51 అవార్డులు దక్కాయని, ఇందులో రాష్ట్ర స్థాయిలో స్వచ్ఛ మున్సిపాలిటీ లలో తిరుపతికి ఒక అవార్డు వచ్చింది. ఉత్తమ స్వచ్ఛతా హరిత అంబాసిడర్లు-5, ఉత్తమ స్వచ్ఛతా ఎన్ జీ ఓ లు -2, ఉత్తమ స్వచ్ఛతా వారియర్లు - 5, స్వచ్ఛ్ అంగన్వాడీలు-5, స్వచ్ఛ్ ప్రభుత్వ కార్యాలయాలు-3, స్వచ్ఛ్ బస్ స్టేషన్లు-1, స్వచ్ఛ్ గ్రామ పంచాయతీలు-5, స్వచ్ఛ్ ఆసుపత్రులు-3 స్వచ్ఛ హాస్టల్స్ - 3, , స్వచ్ఛ్ పరిశ్రమలు (పెద్ద/మెగా)-1 స్వచ్ఛ పరిశ్రమలు - 2, స్వచ్ఛ్ మునిసిపాలిటీలు-1, స్వచ్ఛ రెసిడెన్షియల్ పాఠశాలలు - 1, స్వచ్ఛ్ రైతు బజార్లు-1, స్వచ్ఛ్ పాఠశాలలు-5, స్వచ్ఛ్ ఎస్ఎల్ఎఫ్ఎస్- 3, స్వచ్ఛ్ గ్రామ సంస్థలు-5 లకు అవార్డులు వచ్చాయని తెలిపారు.

రైతులకు అవగాహన

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: భూముల రీ సర్వేతో సమస్యలు పరిష్కారమవుతాయని, రైతులు రీ సర్వేని సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ శ్రీదేవి సూచించారు. సోమవారం తలారివెట్టు గ్రామంలో రెవెన్యూ అధికారులు భూముల రీ సర్వేకు గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో, వారి వారి భూముల వద్ద సర్వే సిబ్బంది చేరుకుని వివరాలు తీసుకుంటున్నట్లు పరిష్కరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ రాజ్‌కుమార్, వీఆర్‌ఓలు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై స్పందన

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో వెంకట రత్నమ్మ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజింగ్, నేచురల్ ఫామింగ్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు.

కూరగాయలు కొనుగోలు చేస్తున్న దృశ్యం

ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ రైతులు పండించిన పంటను ఏటీఎం మోడల్ వేసిన కూరగాయలు, ఆకుకూరలు స్పందనలో విక్రయించనున్నారని తెలిపారు. వాటి ఆరోగ్య ప్రయోజనాలు గురించి ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఆశా జయలక్ష్మి రేవతి ఎంపీడీవో, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీపీ ప్రమాణ స్వీకారోత్సవం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: నిండ్ర మండల ఎంపీడీవో కార్యాలయంలో నూతన ఎంపీపీగా దుర్గ మల్లికార్జున నాయుడు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు.

ఎంపిపి దంపతులను సన్మానించిన నాయకులు

ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి ఆర్కె రోజా ఎంపిపికి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన ఎంపీపీకి వైసిపి బలో పేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, పార్టీ కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

రేపటి నుండి ఆధార్ ప్రత్యేక క్యాంపులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలో తపాలా శాఖ ద్వారా ఈ నెల 8 వతేది నుండి 14వ తేదీ వరకు ఆధార్ ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు గూడూరు డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ ఎలవి మురళి కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 9వ తేదీ జడ్పీ గర్ల్స్ హైస్కూల్, 10వ తేదీ సిఎస్ఎం హైస్కూల్, 13, 14వ తేదీల్లో విఎస్ఆర్ హైస్కూలులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వినతులు స్వీకరణ

వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ప్రజా విజ్ఞప్తుల దినోత్సవంలో భాగంగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ సోమవారం ప్రజల నుండి విజ్ఞప్తులు స్వీకరించారు. అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు త్వరగా పరిష్కరిస్తామన్నారు.

తగ్గిన జీఎస్‌టీపై అవగాహన

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్ : పేద, మధ్య తరగతి వర్గాలకు కేంద్ర ప్రభుత్వం వస్తు సేవల పన్ను తగ్గించడం ఎంతో ప్రయోజనకరమని డాక్టర్ బి చంద్రమౌళి అన్నారు. తగ్గిన జీఎస్‌టీపై పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ విభాగం ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి చంద్రమౌళి జీఎస్టీ తగ్గింపు వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్త డాక్టర్ జి తిరుమలయ్య, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధ్యాపకులకు, విద్యార్థిని విద్యార్థులకు జీఎస్టీలో ఏ అంశాలలో పన్ను తగ్గించారో చార్టుల ద్వారా వివరించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి. కోటేశ్వరయ్య, కామర్స్ విభాగ అధ్యక్షులు డాక్టర్ ఎ. దేవకి, డాక్టర్ జి. తిరుమలయ్య, తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌డేకు నాలుగు అర్జీలు

ప్రజాశక్తి -దొరవారిసత్రం : దొరవారిసత్రం మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌డేకు నాలుగు అర్జీలు వచ్చినట్లు తహశీల్దార్ సెలకుమారి తెలిపారు. డీ పట్టాకు 1, రేషన్‌కార్డుకు 1, జనన ధ్రువీకరణ పత్రానికి 2 వచ్చాయని ఆమె తెలిపారు.

ముక్కంటికి విరాళాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక శ్రీకాళహస్తీశ్వరాలయానికి పలువురు దాతలు సోమవారం ఆర్థిక విరాళాలు అందించారు.

ఆలయ నిత్యాన్నదాన పథకానికి హైదరాబాదుకు చెందిన వీఎస్ కె రావు రూ. 70 వేలు, గోశాల నిర్వహణకు గుంటూరు కు చెందిన దినకర్ రూ. 40 వేలు చొప్పున విరాళాలు అందించారు. ఆ మొత్తాలను చెక్కు రూపంలో ఏఈఓ మోహన్‌కు అందించారు. అనంతరం దాత కుటుంబాలకు ఆలయ మర్యాదలతో స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం కల్పించారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల వేతనాలు పెంచాలి

ఎస్‌వియు రిజిస్ట్రారుకు సిఐటియు నాయకుల వినతి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ వర్క్ కాంట్రాక్ట్ ఉద్యోగులు వేతనాలు పెంచాలని యూనివర్సిటీ రిజిస్ట్రార్ భూపతి నాయుడుకు సిఐటియు నాయకులు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్ జయచంద్ర, ఆల్ యూనివర్సిటీస్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి, గండికోట నాగ వెంకటేష్ మాట్లాడుతూ గత 10 సంవత్సరాలుగా వర్క్ కాంట్రాక్ట్ కింద కార్మికులు పనిచేస్తున్నారు. ప్రతి సంవత్సరం జిల్లా కనీస వేతన కమిటీ ప్రకారం వేతనం పెంచాలని నిర్ణయిస్తారన్నారు. తిరుపతి కలెక్టర్ ఆదేశం మేరకు వేతనాలు ఉత్తర్వులు మేరకు, కొత్త వేతనం ప్రకారం ఒక్కొక్క కార్మికునికి 538 రూపాయలు ప్రభుత్వ నిర్ణయించిన ప్రకారం వేతనం అమలు చేయాలని, యూనివర్సిటీలో పనిచేస్తున్న వారందరికీ ఐడి కార్డులు, ఈఎస్ఐ కార్డులు, పిఎఫ్ సక్రమంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ అధికారులు సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ వర్క్ కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రాజేంద్ర, కార్యదర్శి మురుగయ్య, కోశాధికారి గణేష్, కమిటీ సభ్యులు సుమతమ్మ, మీనా, ధరణి, కళావతి, రాధమ్మ , కృష్ణవేణ, సెల్వి, రవి, వెంకటస్వామి, ముని పాల్గొన్నారు.

ఎస్‌వియు రిజిస్ట్రారుకు వినతిపత్రం అందిస్తున్న సిఐటియు జిల్లా నాయకులు

నిరుపేదలకు భూములు ఇవ్వాలి

నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : భూమి లేని నిరుపేదలకు భూములు ఇవ్వాలని సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి జోగి శివ కుమార్ పేర్కొన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద బాలయ పల్లి మండలం గొట్టి కాడు గ్రామస్థులతో కలిసి సోమవారం ఆయన గూడూరు సబబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలాయపల్లి మండలం పరిధిలోని గొట్టిపాడు రెవెన్యూ సర్వే నెంబరు 1, 33, 36 లలో ఉన్న పూర్తి విస్తీర్ణం 1559 ఎకరాల ప్రభుత్వ భూమి వుందని పేర్కొన్నారు. గ్రామానికి చెందిన ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు చెందిన 50 మంది వ్యవసాయ కార్మికులు కూలి పనులు చేసుకుని జీవిస్తున్నారన్నారు. వారికి ఎలాంటి జీవనాధారం లేదని తెలిపారు. వారికి భూములను మంజూరు చేయాలని తెలిపారు. అనంతరం సబ్ కలెక్టర్ రాఘువేంద్ర మీనాకి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పామంజి మణి, కెవిపిఎస్ నాయకులు అడపాల ప్రసాద్, ఎంబేటి చంద్రయ్య , రాజాగోపాల్, వసంత్, ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ నిబంధనల మేరకే ఎంబిబిఎస్ ప్రారంభం

- అన్నా గౌరీ హాస్పిటల్ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ప్రభుత్వ నిబంధనలు ప్రకారమే ఎంబిబిఎస్ సీట్లు ప్రారంభ మయ్యాయని పుత్తూరు అన్నా గౌరీ హాస్పిటల్ సీఈవో ప్రభాకర్ రెడ్డి తెలిపారు. పుత్తూరు అన్నా గౌరీ కళాశాల ఆవరణలో సోమవారం విలేక రుల సమావేశం నిర్వహించారు.

మాట్లాడుతున్న అన్నాగౌరీ కళాశాల సీఈవో ప్రభాకర్‌రెడ్డి

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన కన్వీనర్ కోటా కింద 50 సీట్లు కేటాయించారన్నారు. అందులో 3 వికలాంగుల కోటాలు, మిగిలిన 47 సీట్లు అందులో 44 సీట్లు భర్తీ అయ్యాయని, అందులో మూడు సీట్లు విద్యార్థులు చేరలేదన్నారు. విద్యార్థులకు అనుకూలంగా కళాశాలలో అన్ని వసతులు ఏర్పాటు చేశామని, ఫ్యాకల్టీలను 200 మందికి పైగా ఏర్పాటు చేశామని తెలిపారు. అనుభవంతో కూడిన అధ్యాపకులు వున్నారన్నారు. ఇప్పుడు చేరిన విద్యార్థులు అందరికీ, తల్లిదండ్రులకు ఫీజులు అనుకూలంగా నిర్వహించామన్నారు. దశల వారీగా ఫీజులు చెల్లించుకోవచ్చని, కళాశాలలోని హాస్టలు వసతులు అన్ని సౌకర్యాలు కలిగి ఉన్నాయని, ఎంబీబీఎస్‌కు కావలసిన పరికరాలు, ల్యాబ్, ల్యాప్ టాప్, విద్యార్థులకు కావలసిన యూనిఫామ్ అన్ని, కళాశాల ద్వారానే అందిస్తున్నామన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మొదటి సంవత్సరం కళాశాల ప్రారంభం, ఎలాంటి ఇబ్బందులు ఎదురుకావన్నారు. ఈ కార్యక్రమంలో అన్నా గౌరీ కళాశాల డైరెక్టర్ డాక్టర్ సుధాకర్, డిప్యూటీ డైరెక్టర్ మిథున్ కుమార్, చంద్రబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి నాయకునికి ఘన సన్మానం

దామోదర్‌రెడ్డిని సన్మానిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - వాకాడు: వాకాడు సీనియర్ రాజకీయ నాయకుడు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కొడవలూరు దామోదర్ రెడ్డి వైసిపి సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా నియమితులయ్యారు. వైసిపి వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఆయనకు సోమవారం ఘన సన్మానం చేశారు.కొడవలూరు దామోదర్ రెడ్డికి రామ్ కుమార్ రెడ్డి శాలువా కప్పి ఘనంగా సన్మానించి అభినందించారు. మండల పరిధిలోని వైసిపి నాయకులు కొడవలూరును పూల మాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. రామ్ కుమార్ రెడ్డి దామోదర్ రెడ్డి సేవలను కొనియాడారు. దామోదర్ రెడ్డి మాట్లాడుతూ వైసిపి సెంటర్ ఎగ్జిక్యూటీవ్ మెంబర్‌గా నియమించడంలో సహకరించిన మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి, నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేదురుమల్లి హిమకుమార్ రెడ్డి , వాకాడు ఉప సర్పంచ్ పాపా రెడ్డి రాజశేఖర్ రెడ్డి, వైసిపి మండల అధ్యక్షుడు ఏనుగు సుధాకర్ నాయుడు, గూడూరు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు, వాకాడు ఎంపీటీసీ ఎంబేటి యాదగిరి, మండల పరిధిలోని వైసిపి నాయకులు, పలువురు సర్పంచులు, వైసిపి మండల పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి -బాలాయపల్లి: మండలంలోని గ్రామీణ ప్రాంతాల పేదల ఆరోగ్యం కోసమే నారాయణ ఆరోగ్య మస్తు పథకం ద్వారా ఉచిత వైద్య సేవలను మన్నూరు గ్రామ పరిసర ప్రాంత ప్రజలకు అందించే లక్ష్యంతో బాలాయపల్లి మండల వైసీపీ ఎగ్జిక్యూటీవ్ మెంబర్ కాటూరు ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మన్నూరు గ్రామం లో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఆర్ఓ ఏ శ్రీధర్ రావు, హాస్పిటల్స్ సిబ్బంది , గ్రామస్తులు పాల్గొన్నారు.

నదిలో ఇసుక రవాణాకు అడ్డుకట్ట

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలోని దర్గామిట్ట సమీపంలో ఉన్న స్వర్ణముఖి నదిలో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్టపడింది. నదిలో నిత్యం ఎద్దుల బండ్ల ద్వారా ఇసుక తరలిస్తుండడంతో గుంతల మయంగా మారింది. ఫలితంగా భారీ గుంతల్లోకి మురుగు నీరు చేరుతుండడంతో తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఏర్పడింది. దీంతో దర్గా మిట్ట కాలనీ వాసులు సమస్యను ఎమ్మెల్యే దష్టికి తీసుకెళ్లారు. ఆ మేరకు స్పందించిన ఎమ్మెల్యే నదిలో ట్రెంచ్ కొట్టాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో వన్ టౌన్ సీఐ గోపి సమక్షంలో ట్రెంచ్ ఏర్పాటు చేసి ఇసుక రవాణాకు దారి లేకుండా అడ్డుకట్ట వేశారు. టీడీపీ పట్టణాధ్యక్షులు విజయ్ కుమార్ నాయుడు పాల్గొన్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

దళితుల వినూత్న నిరసన

వినూత్న రీతిలో నిరసన తెలుపుతున్న దృశ్యం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వెదురుకుప్పం మండలం బొమ్మేపల్లి పంచాయతీ దేవలం పేటలో అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన వారిని కఠినంగా శిక్షించాలని పుత్తూరు మండలం తడుకు పంచాయతీలోని ఎగువ గూళూరు దళితులు సోమవారం. అర్ధనగ్నంగా వినూత్న రీతిలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి వై నందయ్య మాట్లాడుతూ వెదురుకుప్పం మండలం దేవళం పేటలో అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టడం ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ అన్నారు. దుండగులను వెంటనే కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్య క్రమంలో దళితలు టిరవి భూపాల్, వై కేశవులు, వి శివయ్య, వి గోపాల్, కె కృష్ణ, టి తులసి బాబు, వి నాగార్జున, కె కార్తవరాయన్, టి గిరి బాబు, వి శివ పాల్గొన్నారు.

రీ సర్వేతోనే భూ సమస్యలు పరిష్కారం: తహశీల్దారు

ప్రజాశక్తి -రామచంద్రపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూ రీ సర్వే తోనే గ్రామాలలో భూ సమస్యలు పూర్తి స్థాయి లో పరిష్కారం అవుతాయని తహశీల్దారు యు మధుసూదన్ రావు అన్నారు. సోమవారం మధ్యాహ్నం కమ్మపల్లి లో భూ రీ సర్వేపై ర్యాలీ, గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్మపల్లి రెవెన్యూ గ్రామ లెక్క దాఖలాలు భౌగోళికంగా

983.43 ఎకరాల భూమి వుందని, అందులో 705.51 ఎకరాల భూమి పట్టా భూమి, 47.89 ఎకరాల దరఖాస్తు భూమిగా రెవెన్యూ రికార్డులలో నమోదై ఉందన్నారు. టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఎన్ చిన్న బాబు మాట్లాడుతూ గ్రామాలలోని రైతులందరూ భూ రీసర్వేకు సహకరించాలని కోరారు. భూ రీ సర్వేలో రైతుల భూమికి సంబంధించిన సంబంధిత రైతుల పేరున పట్టాదారు పాస్ బుక్, రైతు పేరును రెవెన్యూ రికార్డులలో నమోదు చేయడం, భూమికి సరిహద్దులు నిర్ణయిస్తామన్నారు. ఆర్ నీలకంట చౌదరి మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్వహించే భూ రీ సర్వే వల్ల రెవెన్యూ రికార్డుల ఆధునికీకరణ చేస్తామన్నారు. ప్రతి రైతు రీ సర్వేలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆర్ఎస్ డిప్యూటీ తహశీల్దారు అమృత మాట్లాడుతూ భూ యజమానులకు భూ సమస్యలు లేకుండా భూ యాజమాన్యపు హక్కులు కల్పించ డానికి రీ సర్వే రైతులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారి ప్రదీప్ నాయుడు, సర్వేయర్ తరుణ్, మాధవయ్య, రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర అవార్డుల బహూకరణ

స్వచ్ఛ ఆంధ్ర అవార్డును స్వీకరిస్తున్న కమిషనర్ మంజునాథగౌడ్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్వచ్ఛ ఆంధ్ర జిల్లా స్థాయి అవార్డులు - 2025ను తిరుపతి కలెక్టరేట్ భవనంలో సోమవారం అందించారు. స్వచ్ఛ ఆంధ్ర అవార్డును స్థానిక మున్సిపల్ కమిషనర్ మంజు నాథ్ గౌడ అందుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్, పురపాలక, నగర కమిషనర్లు, అధికారులు, అవార్డు గ్రహీతలు హాజరయ్యారు. రాష్ట్రంలో 18 విభాగాలలో, 51 పట్టణ, గ్రామ ప్రాంతా లకు ఈ అవార్డులు అందించారు. వీటిలో ఒకటి పుత్తూరు మున్సిపాల్టీకి స్వచ్ఛ ఆంధ్ర అవార్డు వరించింది. ఈ అవార్డును కమిషనర్ శ్రీమంజునాథ్ గౌడ్ కలెక్టర్ చేతుల మీదుగా అందుకున్నారు. పుత్తూరు పురపాలక సంఘం పరిధిలో పనిచేసే ఎం అంకయ్యకు ఉత్తమ పారిశుధ్య కార్మికుడి అవార్డు అందించారు. వీరికి కలెక్టర్ వెంకటేశ్వర్ అవార్డును అందించారు.

కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సమాఖ్య సభ్యులు

రామచంద్రపురం: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని సి కె పల్లి గ్రామ సమాఖ్యలో పెరటి తోటల పెంపకంలో డ్వాక్రా మహిళలు ఉత్తమ ప్రతిభ చూపినందుకు గ్రామ సమైక్యకు స్వచ్ఛ ఆంధ్ర అవార్డును సోమవారం వెలుగు ఏపీఎం గురుమూర్తి గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు గీత, సంఘమిత్ర మునీశ్వరి లకు అందించారు. ఆగస్టు 20వ తేదీ రాష్ట్రస్థాయి అధికారులు కిచెన్ గార్డెన్(పెరటి తోటల పెంపకం) సికె పల్లి గ్రామ సమైక్యలోని డ్వాక్రా మహిళలు చేపట్టిన పెరటి తోటల పెంపకాన్ని పరిశీలించారు. రాష్ట్ర స్థాయి కమిటీ సభ్యులు పెరటి తోటల పంపకంలో సికె పల్లి గ్రామ సమాఖ్య డ్వాక్రా మహిళలు నాణ్యమైన కూర గాయలను, ఆకుకూరలను పండిస్తున్నారని ఆ మహిళలను అభినందించారు. రాష్ట్ర కమిటీ సిఫార్సు మేరకు జిల్లా అధికారులు పెరటి తోటల పెంపకంలో సి కె పల్లి వివో కి స్వచ్ఛ ఆంధ్ర అవార్డు దక్కిందని వెలుగు ఏపీఎం గురుమూర్తి తెలిపారు. సికె పల్లి గ్రామ సమాఖ్య కు స్వచ్ఛ ఆంధ్ర అవార్డు అవార్డు రావడం పట్ల మండల సమాఖ్య సభ్యులు, సంఘమిత్రలు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, డ్వాక్రా మహిళలు హర్షం వ్యక్తం చేశారు.

బాలికల వసతి గృహానికి రాష్ట్ర స్థాయి అవార్డు

అవార్డు అందుకున్న హాస్టలు వార్డెన్

కోట : కోట మండలంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహానికి స్వచ్ఛ ఆంధ్ర జిల్లా స్థాయి అవార్డును తిరుపతి కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ చేతుల మీదుగా కోట ఎస్ డబ్ల్యూ గర్ల్స్ హాస్టల్ హాస్టల్ వార్డెన్ టి ఉషారాణి అందుకున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం తిరుపతి జిల్లాలో స్వచ్ఛంద్రా అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం విజయవాడలో స్వచ్ఛ ఆంధ్ర అవార్డులను ప్రదానం చేశారు. అందులో భాగంగా జిల్లా స్థాయిలో వివిధ కేటగిరీలలో స్వచ్ఛత కార్యక్రమాలలో ప్రతిభ కనబరిచిన వారికి ఈ అవారులు అందించారు. ఈ మేరకు కోట మండలంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహానికి స్వచ్ఛత ఆంధ్ర అవార్డును దక్కించుకున్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం, మిట్టపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో 8వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సిడిపివో మెహబూబి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం పిల్లలకు విద్య సామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపరువైజర్ చెంచు లక్ష్మీ, నీరజ దేవి, భాగ్యేశ్వరి, పద్మావతి పాల్గొన్నారు.

క్రైం న్యూస్

ఆటో బోల్తా

ముగ్గురికి స్వల్ప గాయాలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు మండల పరిధిలోని గూడూరు – సైదాపురం రోడ్డు మార్గంలో ఆటో అదుపు తప్పి బోల్తా పడిన ప్రమాదంలో ముగ్గురికి స్వల్ప గాయాలైన సంఘటన సోమవారం మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు సైదాపురం మండల పరిధిలోని కృష్ణా రెడ్డి పల్లె నుండి గూడూరు కి వస్తుండగా సైదాపురం బ్రిడ్జి దాటిన తరువాత ఆటో టైరు పగిలి బోల్తా పడిందన్నారు. ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయని తెలిపారు.

వైన్‌షాప్ ఎదుట యువకుడు కత్తితో హల్‌చల్

ప్రజాశక్తి- తిరుపతి సిటీ తిరుపతిలోనే ఓ వైన్ షాప్ వద్ద మద్యం మత్తులో యువకులు కత్తితో హల్‌చల్ చేసిన ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు .. తిరుపతి విక్టరీ వైన్ షాప్ వద్ద ఓ యువకుడు పుల్లుగా మద్యం సేవించి, కత్తి తీసుకుని అక్కడ హల్చల్ చేస్తూ, చుట్టుపక్కల వారిని బెదిరించాడు. దీంతో అక్కడ ఉన్న వాళ్ళు భయభ్రాంతులకు గురయ్యారు. దశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీనిపై స్పందించిన పోలీసులు వీడియోల ఆధారంగా యువకుడిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. ఎస్పీ ఆదేశాల మేరకు భవిష్యత్తులో ఎలాంటి ఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామని సంబంధిత పోలీస్ అధికారులు మీడియాకు ఈ సందర్భంగా వెల్లడించారు.

సమీక్షా సమావేశం

ప్రజాశక్తి- వాకాడు: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో యం సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో మండలంలోని 12 సచి వాల యాలకు సంబంధించిన సిబ్బందితో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సిబ్బందికి పలు సూచనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వారు జారీ చేసిన పి4, వర్క్ ఫ్రం సర్వేల పై సమీక్ష నిర్వహించారు. సిబ్బంది క్రమశిక్షణతో ఉంటూ పని పట్ల నిబద్ధతతో, తప్పనిసరి హాజరు కావాలని ఆదేశించారు అలాలేకుంటే క్రమశిక్షణ చర్యలు తీసుకోనున్నట్లు ఎంపిడివో తెలిపారు. సచివాలయానికి వచ్చే సమయం, ప్రజలకు అందు బాటులో ఉంటూ ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ ఫలాలను సకాలంలో గ్రామ ప్రజలకు అందించాలని సిబ్బందికి సూచించారు.

అన్నదానం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, బియ్యపు శ్రీవాణి రెడ్డి దంపతుల 30వ వివాహ వేడుకలు సోమవారం నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. స్థానిక అర్ధనారీశ్వ రాలయంలో మధుసూదన్ రెడ్డి సతీ సమేతంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు, పేదలకు అన్నదానం చేశారు. పెద్ద ఎత్తున వైసిపి నాయకులు, కార్యకర్తలు విచ్చేసి మధుసూదన్ రెడ్డికి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అంజూరు శ్రీనివాసులు, ఉన్నం వాసుదేవనాయుడు పాల్గొన్నారు.

ప్రమాదంలో ప్రజాస్వామ్యం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: కేంద్రంలోని మోడీ పాలనలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, ప్రజలు రాజ్యాంగబద్ధంగా సాధించిన ఓటు హక్కును వినియోగించు కోలేకపోతున్నారని శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ సమన్వయకర్త తలపా దామోదర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం పట్టణంలోని బృందమ్మ కాలనీలో ఓట్ చోర్ గద్ది చోడ్ కార్యక్రమంపై కాంగ్రెస్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. మోడీ ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థలను తమ ఆధీనంలో ప్రజలు ఓట్లను దొంగలించడం, తొలగించడం చేస్తోందని వివరించారు. జనార్ధన్ రెడ్డి, సురేంద్ర రెడ్డి పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ సొసైటీ వైస్ ఛైర్మన్‌గా మయూర్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా నూతన కమిటీ వైస్ ఛైర్మన్ గా పట్టణానికి చెందిన ఎంజీఎం సంస్థల డైరెక్టర్ గుడ్లూరు మయూర్ ఎన్నికయ్యారు. సోమవారం తిరుపతి జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కమిటీని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ అధ్యక్షతన ఎన్నుకున్నారు. చైర్మన్ గా దగ్గుమాటి శ్రీహరి, వైస్ చైర్మన్ గా మయూర్‌తో పాటు తక్కిన కమిటీని ఎన్నుకున్నారు. రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో త్వరలో బ్లడ్ బ్యాంక్ ని ఏర్పాటు చేస్తామని మయూర్ తెలిపారు.

దోబీఘూట్‌లో నిర్మించిన ఇళ్లను తొలగించండి : సిపిఎం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుపతి రూరల్ దోబీఘూట్ ఆక్రమించుకొని నిర్మించిన ఇళ్లను తొలగించాలని కోరుతూ తిరుపతి రూరల్ తహశీల్దార్‌కు సిపిఎం నాయకులు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యులు జయచంద్ర, తిరుపతి రూరల్ కార్యదర్శి సుమన్ మాట్లాడుతూ తిరుపతి రూరల్ వేదాంతపురం పంచాయతీలో 2014 సర్వే నెంబర్‌లో 56 సెంట్లు విలువైన భూమిని, కొంతమంది పెత్తందారులు, ఆ గ్రామ మాజీ సర్పంచ్ చిరంజీవి రెడ్డి, ముదిరాజ్, చంద్ర ఆక్రమించుకొని ఇల్లు నిర్మించుకుంటున్నారు. 20 కోట్ల విలువైన రజకుల దోబీ ఘాటును ఆక్రమించుకోవడం అన్యాయమన్నారు. 2006 నుంచి ఇప్పటివరకు ఆ దోబీ ఘూట్ లోకి రజకులను రాకుండా అడ్డుకుంటున్నారని వెళితే దాడి చేసి గాయ పరిచారన్నారు. రూరల్ తహశీల్దార్ ఇప్పటికైనా స్పందించి ఆ స్థలాన్ని రజకులకు ఇప్పించాలని కోరారు. లేకుంటే ఎమ్మార్వో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని హెచ్చ రించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు జి చిన్న బాబు, రజక సంఘం అధ్యక్షులు శంకర్, విజయ్, ధన,మధుకుమార్ పాల్గొన్నారు.

విఓఎల సమస్యలు పరిష్కరించండి : సిఐటియు

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి రూరల్ (తొట్టంబేడు) విఓఎలకు చాలీచాలని జీతాలిస్తున్నారని, అది కూడా సక్రమంగా ఇవ్వడం లేదని సిఐటియు జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య విమర్శించారు. సోమవారం విఓఎ(యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఎపిఎం నర్సింహులుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పెనగడం గురవయ్య మాట్లాడుతూ గ్రామాల్లో మహిళలకు మహిళా మండలి సమాఖ్య ద్వారా రుణాలను అందించి, ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగాలన్నది ప్రభుత్వ ఉద్దేశమన్నారు. మహిళలకు రుణాలు మంజూరు చేయించడంలో విఓఎలుప్రధాన పాత్ర పోషిస్తుంటారన్నారు. యానిమేటర్లకు 5జీ సిమ్‌కార్డులు ఇవ్వాలన్నారు. విఓఎలపై రాజకీయ వేధింపులు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో విఓఎల సంఘం జిల్లా నాయకులు వేణు, వెంకటయ్య, రమేష్ పాల్గొన్నారు.

ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తే సహించం..

ఎండోమెంట్ అధికారులకు నేదురుమల్లి హెచ్చరిక

ప్రజాశక్తి-వాకాడు: దేవాదాయ ధర్మాదాయ శాఖ (ఎండోమెంట్) అధికారులు ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తే సహించేది లేదని, వాకాడులో మీ ఆటలు సాగవన్న సంగతి గుర్తుంచుకోవాలని ఎండోమెంట్ అధికారులను నేదురు మల్లి రామ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిబంధనలు తెలియ కపోతే సుదీర్ఘ రాజకీయ అనుభవం, విషయ పరిజ్ఞానం తెలిసిన ఆ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని అడిగి తెలుసుకోవాలని సూచించారు. వాకాడు శివా లయం, అలగనాథ స్వామి ఆలయ భూములు ఎంతో కాలంగా ఈ ప్రాంత వాసులు సాగు చేసుకుంటున్నారని దేవాలయాల అభివృద్ధి కి సాగు ధర పెంచే దిశగా వేలం పాట నిర్వహించడం మంచిదేనన్నారు. కానీ నిబంధనలకు విరుద్ధంగా వేలంపాట నిర్వహిస్తే సహించేది లేదన్నారు. ఈ ఆలయాల పరిధిలో 96 ఎకరాల భూమి ఉంటే వాటి మొత్తం భూమి వివరాలు ప్రజల ముందు ఉంచి ప్రజల అభిప్రాయం మేరకు గ్రామసభ నిర్వహించి వేలంపాట

మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

నిర్వహించాలన్నారు. 96 ఎకరాలలో 25 ఎకరాలకు వేలంపాట నిర్వహించడం ఏమిటని ప్రశ్నించారు. ఒకవేళ ఈ భూమి వివాదాల్లో ఉన్నప్పుడు ఎంత భూమి వివాదాల్లో వుందో అనే సంగతిని ప్రజలకు వివరించాలన్నారు. రాజకీయ ఒత్తిళ్లకు లోనై ఇష్టానుసారం వ్యవహరిస్తే తగిన మూల్యం చెల్లిస్తారన్నారు. మొత్తం భూమికి గ్రామ సభలో ప్రజల అభీష్టం మేరకు మాత్రమే వేలం పాట నిర్వహించాలని సూచించారు. పంత్రంగం దేవాలయానికి సంబంధించిన రూ.17 లక్షల దేవాలయ సొమ్మును గోల్‌మాల్ చేసిన విషయంపై కూటమి ప్రభుత్వం ఎవరిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలన్నారు.

IN THE COURT OF THE PRL. CIVIL JUDGE (JUNIOR DIVISION), CHITTOOR
I.A.No. 323 of 2020
O.S.No.514 of 2019

Between:
K.Sowjanya Kumari .. Petitioner/Plaintiff
And:
K.Ranjith Kumar and others. ...Respondents/Defendants

NOTICE TO THE 12TH RESPONDENT

To
K.C.Charan Kumar
S/o late K.Chandrasekhar Pillai,
D.NO.1-211, Srinivasulu Chetty Street,
Newpet, Chandragiri post and Mandal,
Now Tirupati District.

Sir,
Please take notice that the petitioner/plaintiff has filed the above I.A. to condone the delay of 19 days in filing the application Under Order 22 Rule 9 CPC and Under Order 22 Rule 4 CPC to bring the legal heirs of 7th defendant as defendants 10 to 12 in the above suit. The said L.A. is posted to **27.10.2025** for your appearance. If you have got any objection you may appear on **27.10.2025 at 10.30 A.M.** either in person or through an Advocate and file your objections. If you fail to do so the matter will be decided ex-parte.

Sd/- **Sri V.LOKANADHA REDDY**
Advocate for Petitioner/ Plaintiff.
Chittoor, Dt.4.10.2025

IN THE COURT OF THE PRL. CIVIL JUDGE (JUNIOR DIVISION), CHITTOOR
I.A.No. 324 of 2020
O.S.No.514 of 2019

Between:
K.Sowjanya Kumari .. Petitioner/Plaintiff
And:
K.Ranjith Kumar and others. ...Respondents/Defendants

NOTICE TO THE 12TH RESPONDENT

To
K.C.Charan Kumar
S/o late K.Chandrasekhar Pillai,
D.NO.1-211, Srinivasulu Chetty Street,
Newpet, Chandragiri post and Mandal,
Now Tirupati District.

Sir,
Please take notice that the petitioner/plaintiff has filed the above I.A. to set aside the abatement to bring the legal heirs of 7th defendant as defendants 10 to 12 in the above suit. The said I.A. is posted to **27.10.2025** for your appearance. If you have got any objection you may appear on **27.10.2025 at 10.30 A.M.** either in person or through an Advocate and file your objections. If you fail to do so the matter will be decided ex-parte.

Sd/- **Sri V.LOKANADHA REDDY**
Advocate for Petitioner/ Plaintiff.
Chittoor, Dt.4.10.2025

IN THE COURT OF THE PRL. CIVIL JUDGE (JUNIOR DIVISION), CHITTOOR
I.A.No. 325 of 2020
O.S.No.514 of 2019

Between:
K.Sowjanya Kumari .. Petitioner/Plaintiff
And:
K.Ranjith Kumar and others. ...Respondents/Defendants

NOTICE TO THE 12TH RESPONDENT

To
K.C.Charan Kumar
S/o late K.Chandrasekhar Pillai,
D.NO.1-211, Srinivasulu Chetty Street,
Newpet, Chandragiri post and Mandal,
Now Tirupati District.

Sir,
Please take notice that the petitioner/plaintiff has filed the above I.A. to bring the legal heirs of 7th defendant as defendants 10 to 12 in the above suit. The said L.A. is posted to **27.10.2025** for your appearance. If you have got any objection you may appear on **27.10.2025** at 10.30 A.M. either in person or through an Advocate and file your objections. If you fail to do so the matter will be decided ex-parte.

Sd/- **Sri V.LOKANADHA REDDY**
Advocate for Petitioner/ Plaintiff.
Chittoor, Dt.4.10.2025

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE :: TIRUPATI
O. E. P. NO. 99 of 2024
O.S.NO. 165 of 2016

Between:
Smt. B. Lakshmi ...D.Hr./Plaintiff
And
Sri. K.V. Jaya Kumar ...J.Dr./Defendant

NOTICE TO JDR / DEFENDANT

K.V.Jaya Kumar, S/o Late Vasudevan, aged 55 years, Occ. Business, Residing at D-No.15-907, Sri Kalahasthi Road, Renigunta Village and Mandal, Tirupati District, (erstwhile,chittoor district)

Whereas you have failed to satisfy the decree passed against you on 29-08-2024 in a Suit O.S.No.165 / 2016 in favour of the D.H.R / Plaintiff The DHR / Plaintiff has filed Execution Petition in the above matter for realisation of the decreetal amount by attaching the E.P.Schedule Property . If you have got any objection you may appear before this Court at 10:30AM on 23-10-2025 either in person or through an Advocate and file your objection. If you fail to do so, the matter will be decided exparte.

Hg.Date. 23-10-2025

// BY ORDER OF THE COURT //
B. MURALI MOHAN,
ADVOCATE FOR DHR/ PLAINTIFF, TIRUPATI.

పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డిని కలిసిన ప్రముఖులు

ప్రజాశక్తి -కోట : వైసిపి సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబరుగా ఎన్నికైన పేర్నాటి శ్యాం పసాద్ రెడ్డి ని ఎమ్మెల్సీ మేరిగా మురళీధర్, కోట మండల అధ్యక్షుడు పలగాటి సంపత్ కుమార్ రెడ్డి, వైసీపీ యువ నాయకులు చిల్లకూరు సాయి ప్రసాద్ రెడ్డిలు మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి సత్కరించి శుభాకాంక్షలు తెలిపా రు. పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డిని అధిష్టానం గుర్తించి సిఈసి సభ్యులుగా ఎంపిక చేయడంతో పిసిపి కోట మండల అధ్యక్షుడు పలగాటి సంపత్ కుమార్ రెడ్డి, వైసీపీ యువ

పేర్నాటి శ్యాం ప్రసాద్‌రెడ్డిని కలిసిన ప్రముఖులు

నాయకుల చిల్లకూరు సాయి ప్రసాద్ రెడ్డి లు సంతోషం వ్యక్తం చేశారు. ఎన్నో సంవత్సరాల నుండి వైసిపి బలోపేతా నికి పేర్నాటి శ్యాం ప్రసాద్ రెడ్డి అలుపెరగని పోరాటం చేయడం అందరికీ తెలిసిన విషయమేనని వైసిపి యువ నాయకులు చిల్లకూరు సాయి ప్రసాద్ రెడ్డి గుర్తు చేశారు.

నేడు వాల్మీకి జయంతి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మంగళవారం వాల్మీకి జయంతి కార్యక్రమాలు అధికారికంగా నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో ఈనెల 7న మంగళవారం జిల్లా సచివాలయంలోని వివేకానంద భవన్‌లో ఉదయం 10.30 గంటలకు మహర్షి వాల్మీకి జయంతి అధికారిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, ఇందులో భాగంగా మహర్షి వాల్మీకి చిత్ర పటానికి పూల మాలలు వేసి అంజలి ఘటించడం జరుగుతుందన్నారు.

చెక్‌పోస్ట్ కూడలిలో ట్రాఫిక్ సమస్యలు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని చెక్‌పోస్ట్ కూడలిలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారడంతో వాహనదారులు తరచూ ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు ఇరు వైపులా చిరు వ్యాపారులు స్థలాన్ని ఆక్రమించుకోవడంతో ఈప్రాంతం ఇరుకుగా మారింది. దీంతో వాహనదారులు రాకపోకలకు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాలనుండి వచ్చే భారీ వాహనాలు కూడా ఈ దారిగుండా ప్రయాణిస్తుండటంతో ట్రాఫిక్ సమస్య మరింత కష్టతరంగా మారుతోంది. ఇప్పటికే ఇక్కడ రోడ్డు చాలా ఇరుకుగా ఉంది, ఇక ట్రాఫిక్ జామ్ అయితే కదిలే పరిస్థితి కూడా ఉండటం లేదని పోలీసులు చొరవ చూపి వారపు సంత, ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్‌ను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి- పెద్దపంజాణి: రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం విద్యార్థులకు 7వ తేదీ మంగళవారం వ్యాసరచన వక్తృత్వ,పెయింటింగ్ పోటీలను నిర్వహించాలని ఎంపీడీవో బాలాజీ విద్యాశాఖ అధికారులకు సూచించారు. సోమవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఆన్లైన్ ద్వారా జరిగిన జీఎస్టీ సమావేశంలో ఎంపీడీవో బాలాజీ, డిప్యూటీ ఎంపీడీవో శారదా దేవి, మండల విద్యాశాఖ అధికారి గోపాల్ రెడ్డి, జీఎస్టీ నోడల్ ఆఫీసర్ ఎస్వీ ప్రసాద్, ఏఈఓ శివ మురళి, పంచాయతీ కార్యదర్శులు బాలాజీ, జయశ్రీ పాల్గొన్నారు.

జస్టిస్ గోపాల్ గౌడ్ జన్మదిన వేడుకల్లో వేణుగోపాల్ రెడ్డి

ప్రజాశక్తి- పుంగనూరు: కర్ణాటక రాష్ట్రం చింతామణిలో జరిగిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గోపాల గౌడ జన్మదిన వేడుకకు ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు. ఆయనతో పాటు పుంగనూరు నియోజకవర్గ జనసేనా నాయకులు వేణు గోపాల్ రెడ్డి పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా జస్టిస్ గోపాల్ గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

ఉడా ఛైర్మన్ ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్సీ

ప్రజాశక్తి- కుప్పం: పిఎంకె ఉడా ఛైర్మన్ డాక్టర్ సురేష్ బాబు ప్రమాణ స్వీకారానికి కుప్పం నియోజకవర్గంలో టిడిపి నేతలు భారీగా తరలివెళ్లారు. మదనపల్లి ఉడా కార్యాలయంలో ఛైర్మన్‌గా డాక్టర్ సురేష్ బాబు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి కుప్పం నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల నుండి టిడిపి శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ మునిరత్నం తో పాటు టిడిపి నేతలు డాక్టర్ సురేష్‌ను ఘనంగా సత్కరించారు.

సురేష్ బాబుకు సన్మానం

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి : కుప్పం పట్టణానికి చెందిన డాక్టర్ బిఆర్.సురేష్ బాబు పీకేఎం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఉడా) ఛైర్మన్‌గా సోమవారం మదనపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో అధికారికంగా ప్రమాణస్వీకారం చేశారు. కుప్పం, పలమనేరు, మదనపల్లి డివిజన్లను కవరే చేస్తూ సేవలందించనున్న ఉడా ఛైర్మన్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు బిఎం.రాధ కిషోర్ గౌడు, పలమనేరు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు భువనచంద్ర గౌడు పాల్గొన్నారు. అనంతరం వారు సురేష్ బాబును శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. వారివెంట నాగరాజు, పలని, మంజు, సుబ్బయ్య, రమేష్, కృష్ణమూర్తి, శివ ఉన్నారు.

వేతనాలు పెంచండి

డేటా ఎంట్రీ ఆపరేటర్ల ధర్నా

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్ల జీతాలు పెంచాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ 2008లో వైద్య ఆరోగ్యశాఖలో డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా నియమితులైన వారికి నేటికి నెలకు రూ.15వేల జీతం ఇస్తున్నారని, ఆయుష్ కార్యక్రమం ద్వారా నియమితులైన కాంట్రాక్టు ఉద్యోగులు నెలకు రూ.25వేల జీతం పొందుతున్నట్లు తెలిపారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లను కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించి జీతం పెంచాలని కోరారు.

చెక్ డ్యాంకు సైడ్ వాల్స్ నిర్మించాలి

రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఉమాపతి

ప్రజాశక్తి- పలమనేరు రూరల్ (గంగవరం): పెద్దపంజాణి మండలం మీదుగా గంగవరం, పలమనేరు రూరల్ మండలాలలో కౌండిన్య నది ప్రవహిస్తోందని, నీటి నిలువల కోసం ప్రభుత్వం అక్కడక్కడ చెక్ డ్యాంలు నిర్మించారని కానీ సైడ్ వాల్స్ నిర్మించకపోవడంతో వర్షపు నీరు వ్యవసాయ పొలాలపై ప్రవహిస్తూ కోతకు గురవుతోందని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఉమాపతి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు నీటిఉధృతి ఎక్కువై పరిసర ప్రాంతాలలో ఉన్న సారవంత భూములపై ప్రవహించి కోతలకు గురౌతోందని దీంతో ఏళ్ల తరబడి వ్యవసాయానికి వీలు లేకుండా అలాగే వదిలేయాల్సి వస్తోందని తెలిపారు. గతంలో పలమనేరు రూరల్ మండలంలోని మొసలిమడుగు గ్రామ సమీపాన ఉన్న కౌండిన్యా నది నీటి ప్రవాహమంతా వ్యవసాయ భూములపై వృథాగా పోతోందని చెక్ డ్యాంలు నిర్మాంచారని కానీ వాటిని పూర్తి స్థాయిలో సిమెంట్‌తో సైడ్ వాల్స్ నిర్మించాలని డిమాండ్ చేశారు.

అంగన్‌వాడీ కేంద్రానికి స్వచ్ఛ ఆంధ్ర అవార్డు

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం ఇరికిపెంట పంచాయతీ పార్వతీ నగర్(హరిజనవాడ) అంగన్వాడీ కేంద్రాన్ని స్వచ్ఛంద స్వర్ణాంధ్ర అవార్డుకు ఎంపిక కావడంతో సోమవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు, ధ్రువపత్రాన్ని అంగన్వాడీ కార్యకర్త యశోద స్వీకరించారు. ఇటీవల విజయవాడ నుండి ఎస్ ఎ ఎస్ ఏ బృందం ఆకస్మిక తనిఖీ నిర్వహించి అంగన్వాడీ కేంద్రంలో వంటగది పరిసరాలు మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండడం, విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన భోజనం వండి పెట్టడం, పోషక ఆహారం సక్రమంగా అమలు చేయడం, ఆవరణంలో పూల మొక్కలు , కూరగాయలు పెంచడం తదితర అంశాలను వారు నమోదు చేసుకొని వెళ్లారు. ఆకస్మికంగా కలెక్టర్ అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి అంగన్‌వాడీ కేంద్రం నడుపుతున్న తీరును ప్రశంసించారు. దీంతో స్వర్ణాంధ్ర అవార్డుకు ఎంపికైనట్లు ఐసిడిఎస్ సూపర్వైజర్ హరిత తెలిపారు.

రోడ్డుకు అడ్డంగా రాతి కూసాలు

పోలీసులకు ఫిర్యాదు చేసిన సర్పంచ్

ప్రజాశక్తి- కార్వేటినగరం: మండలంలోని డిఎం పురం పంచాయ తీ కరవాటి కండ్రిగ గ్రామానికి చాలా సంవత్సరాలుగా రోడ్డు సౌకర్యం లేక పొలాల గట్లు మీద వెళ్లేవారు. 2014 లో రైతులు గ్రామస్తులు కలిసి ప్రజ ప్రతినిధులు కలిసి జిల్లా పరిషత్ నిధులతో గ్రావెల్ పోసి రోడ్డు ఏర్పాటు చేసినట్లు డి ఎం పురం సర్పంచ్ ఇ.తులసి పేర్కొన్నారు. అప్పటి ఎంపీడీఓ శ్రీనివాస ప్రసాద్ సమక్షంలో రోడ్డు ఏర్పాటు చేశారన్నారు. ప్రస్తుతం రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలను తొలగించి రోడ్డులో గుంతలను గ్రావెల్ పోసి చదును చేశారు. అనంతరం రోలర్ తో లెవల్ చేయడానికి సిద్ధం చేస్తే అదే గ్రామానికి చెందిన కె. మునిచంద్రయ్య, కె బాలాజీ, కె ముని చంద్ర, ఎం మాధవ అనే వ్యక్తులు రోడ్డుకు అడ్డంగా రాతి కూసాలు నాటారు. ఇలా ఆటంకం కలిగిస్తే ఎలా అని సర్పంచ్ అడగగా 'నా పొలం నా ఇష్టం..' అని రోడ్డుకు రాతి కూసాలు నాటారు. దీంతో సర్పంచ్ తులసి పోలీసులకు, రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందించారు. అయినా ఎవరు స్పందించలేదని సర్పంచ్ ఆవేదన వ్యక్తపరిచారు. ఉన్నతాధికారులు స్పందించి రాతికూసాలను తొలగించాలని సర్పంచ్ కోరారు.

నివాళులర్పిస్తున్న జనసేన నాయకులు

యుగంధర్‌రెడ్డికి నివాళులు

ప్రజాశక్తి- వెదురుకుప్పం: వెదురుకుప్పం మండలం కొమరగుంట పంచాయతీ సామిరెడ్డికండ్రిగకు చెందిన పోస్టల్ డిపార్టుమెంటు ఉద్యోగి యుగంధర్ భౌతికకాయానికి జనసేన నాయకులు సోమవారం నివాళులు అర్పించారు. కార్వేటినగరం మండల ఐటీ కోఆర్డినేటర్ బాలాజీ రెడ్డి మేనల్లుడు యుగంధర్ రెడ్డి భౌతిక దేహానికి నివాళులు అర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో జనసేన జీడీ నెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, ఏపీ మాల వెల్ఫేర్ కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ డాక్టర్ యుగంధర్ పొన్న పాల్గొన్నారు. వెదురుకుప్పం మండల జనసేన సీనియర్ నాయకులు శేఖర్, ప్రసాద్, చిత్తూరు జిల్లా బీసీ సెల్ యువజన అధ్యక్షులు మాదాసి వెంకటేష్, మండల ప్రధాన కార్యదర్శి ప్రతాప్ పాల్గొన్నారు.

స్కూటర్ ఢీ

- విద్యార్థికి గాయాలు - తిరుపతికి తరలింపు

ప్రజాశక్తి- వెదురుకుప్పం: స్కూటరు ఢీకొని విద్యార్థి గాయ పడిన సంఘటన మండలంలో సోమవారం చోటు చేసు కుంది. చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు నియోజకవర్గం పరిధిలో వెదురుకుప్పం మండలం మారేపల్లి గ్రామానికి చెందిన మల్లేశ్వరయ్య కుమారుడు భార్గవ్ చవటగుంట ప్రభుత్వ పాఠశాలలో 9 వ తరగతి విద్యను అభ్యసిస్తున్నాడు. ఇంటికి వెళ్లే ప్రయత్నంలో స్కూలు బయట నిల్చొని వుండగా అటువైపు వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొని గాయా లయ్యాయి. స్థానికులు అతడిని గమనించి 108 సాయం తో అతడిని తిరుపతి ఆసుపత్రికి తరలించారు.

అవగాహనతోనే నిర్మూలన

ప్రజాశక్తి- విజయపురం (నగరి) : ఎయిడ్స్ పట్ల సమాజంలోని ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉంటే ఎయిడ్స్‌ను నిర్మూలించవచ్చని స్థానిక పీసీఎన్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటాచలపతి అన్నారు. సోమవారం కళాశాలలో రెడ్ రిబన్‌క్లబ్ ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ అంటువ్యాధి కాదని అవగాహన పెంచుకుంటే ఈ వ్యాధి నుంచి బయటపడవచ్చన్నారు. రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ హరిబాబు, ఎఎన్ఎం సుగుణ, మహిళా పోలీస్ మంజుల, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి

నిప్పు పెట్టిన వారిని కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి- పెద్దపంజాణి: వెదురుకుప్పం మండలం దేవలంపేట గ్రామంలోడాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన వారిని కఠినంగా శిక్షించాలని మండల మాలమహానాడు అధ్యక్షుడు టిఎం. మంజునాథ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నిరసన తెలిపారు. మాల మహానాడు మండల అధ్యక్షుడు మంజునాథ్, జిల్లా ప్రచార కార్యదర్శి తిప్పయ్య, మండల ప్రచార కార్యదర్శి శివయ్య, కమిటీ సభ్యులు గంగులప్ప, బాబు, వెంకటేష్, రంగప్ప పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవనానికి

స్థలం కేటాయించాలని వినతి

ప్రజాశక్తి- రామకుప్పం: మండలంలోని మనేంద్రం పంచాయతీలో మాదిగలకు కమ్యూనిటీ భవన నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని సోమవారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి సభ్యులు తహశీల్దార్ కార్యాలయంలో... కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. మనేంద్రం గ్రామంలో 30 దళిత మాదిగ కులానికి చెందిన కుటుంబాలు నివసిస్తున్నాయని, వీరంతా రోజువారి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. మాదిగ జాతి అభివృద్ధికి సామూహి క కార్యక్రమాలు, వివాహాలు, సభలు, వైద్య శిబిరాలు, యువజన మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థల కార్యకలాపాలకు ఉపయోగపడుతుందన్నారు. కావున కమ్యూనిటీ భవనం నిర్మాణం కొరకు స్థలాన్ని మంజూరు చేయాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో వెంకటేష్, విజయ్, గోవిందప్ప, రమేష్ తదితరులు ఉన్నారు.